భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు



సరుబుజ్జిలి: సూర్యదేవునికి క్షీరాభిషేకాలు చేస్తున్న అర్చకులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం రంగనాథస్వామి వారి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు బంకుపల్లి వెంకట సత్యగోపాలరావు, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు స్వామివారి నిజరూపదర్శనం కల్పించారు. భక్తులు భారీగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: నరసన్నపేట పట్టణం పెద్దపేట వీధిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి పూజలు ఘనంగా రిగాయి. భారీగా వచ్చిన భక్తజనంతో ఆలయం కిటకిటలాడింది. శనివారం వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి వచ్చి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారన్నారు. మధ్యాహ్నం వరకూ భక్తుల రద్దీ కొనసాగిందని ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు తెలిపారు.

కొత్తూరులో..

కొత్తూరు: రథసప్తమి పూజలను మండల వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు బృందాలుగా పాలు పొంగించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలను సామూహికంగా నిర్వహించారు. సూర్యభగవానుడికి హారతులు సమర్పించారు.

వేంకటేశ్వర ఆలయంలో..

పాతపట్నం: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



కొత్తూరులోని అల్లు వీధిలో మహిళల సామూహిక పూజలు



నరసన్నపేట: క్యూలో ఉన్న భక్తులు



నరసన్నపేట: ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పాతపట్నం: పూజలు చేస్తున్న భక్తులు



కొత్తూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తజనం

క్లుప్తంగా

అందుబాటులోకి వాటర్ ట్యాంకు



మంచినీటి ట్యాంకు వద్ద కొబ్బరి కాయ కొడుతున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో మరో వాటర్ ట్యాంకు వినియోగంలోకి తీసుకువచ్చామని సర్పంచ్ బూరల్లి శంకర్ చెప్పారు. శిథిలమైన వాటర్ ట్యాంకు, ట్రాక్టర్ తొట్టిలను పూర్తి స్థాయిలో పంచాయతీ నిధులు రూ. 2 లక్షలతో మరమ్మతు చేయించామన్నారు. శనివారం వీటిని కొబ్బరి కాయ కొట్టి సర్పంచ్ ప్రారంభించారు. ఇప్పటికే ఒక వాటర్ ట్యాంకు వినియోగంలో ఉందని.. మరొకటి రావడంలో అవసరానికి వీధుల్లో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గుప్త, బీఎల్ శర్మ, ఈఓ సింహాద్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు గనగళ్ల శ్రీను, నేతింటి సింహాచలం పాల్గొన్నారు.

సూర్యనమస్కారాలతో మెరుగైన ఆరోగ్యం



సూర్యనమస్కారాలు సమర్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట: సూర్య నమస్కారాలు నిత్యం చేయడం ద్వారా మంచి ఆరోగ్యం సాధ్యమని యోగా గురువు సదాశివుని రవి అన్నారు. రథసప్తమి సందర్భంగా నరసన్నపేటలోని వేంకటేశ్వరాలయంలో 108 సామూహిక సూర్య నమస్కారాలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న 40 మందిచే సూర్య నమస్కారాలు వేయించి వాటి ప్రాధాన్యతను వివరించడంతోపాటు ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో తెలియజేశారు. పట్టణంలో ప్రతి ఆదివారం యోగా కార్యక్రమాలు వీధుల్లో ఉచితంగా నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వందాన సుప్రజ, మల్లిబాబు, కింజరాపు రామారావు, గుంటక శ్రీధర్, వారణాశి సంతోషి పాల్గొన్నారు.

కొల్లివలసలో పశువైద్య శిబిరం



పశువులకు వైద్యం చేస్తున్న వైద్యులు

బూర్జ: జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా కొల్లివలస గ్రామంలో శనివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. సరుబుజ్జిలి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు సీహెచ్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ చర్యల్లో భాగంగా జంతు హింస చట్టంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. జంతువులను హింసించడం, అక్రమ రవాణా చేయడం నేరమన్నారు. 21 ఆడ దూడలకు డీ వార్మింగ్ మందులు వేశారు. స్థానిక గ్రామ సర్పంచ్ జీడి వేణు, కొల్లివలస పశు వైద్య కేంద్రం డాక్టర్ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కరవంజలో స్కూల్‌లో మోడల్ టెస్ట్

జలుమూరు: కరవంజ మోడల్ స్కూల్‌లో దేసూల విజయ గౌరీ స్మారక పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్ ఆదివారం ఉదయం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇప్పిలి మాధవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచే విజేతలకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఉదయం తొమ్మిది నుంచి 9.30 గంటల వరకూ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి



చోడి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రాజగోపాలరావు

కొత్తూరు: చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని కొత్తూరు వ్యవసాయసబ్ డివిజన్ ఏడీఏ రాజగోపాలరావు రైతులకు సూచించారు. గూనభద్రలో సాగు చేస్తున్న చోడితో పాటు పలు రకాల చిరుధాన్యాల పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల ఏడాదిగా కేంద్రం ప్రభుత్వం గుర్తించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెంచాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తోందన్నారు. చిరుధాన్యాలతో పాటు ఇతర పంటలను ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయాలన్నారు. కార్యక్రమములో జిల్లా ఉత్తమ రైతు అంపిలి బుచ్చిబాబు, ప్రకృతి వ్యవసాయం ఎంటీ ఎస్.సూర్యనారాయణ, గిరిజన రైతు సవర రమేష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం ఓ రికార్డు



ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లు లేని అర్హులకు స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జగనన్న కాలనీ పేరిట గృహ నిర్మాణాలు ఓ రికార్డు అన్నారు. పారశెల్లి గ్రామంలో జగనన్న కాలనీ నిర్మాణం పనులకు శనివారం భూమి పూజ చేశారు. పారశెల్లి, రెల్లివలసలో 23 ఇళ్లు మంజూరైనట్టు చెప్పారు. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు అధికంగా ఇళ్ల నిర్మాణాలు జరగగా.. ఇప్పుడు అతని తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో భారీస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. పేదల సొంతింటి కలను సాగారం చేయాలంటే వైఎస్ కుటుంబానికే సాధ్యమన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 90 వేల ఇళ్లు మంజూరు కాగా 40 వేలకు పైగా నిర్మాణంలో ఉన్నాయన్నారు. నరసన్నపేట నియోజకవర్గం వ్యాప్తంగా ఆరు వేల వరకూ నిర్మాణాలు ప్రారంభమవ్వగా.. వీటిలో సుమారు మూడు వేల ఇళ్లు పూర్తయ్యే దశకు చేరుకున్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. లబ్ధిదారులు అందరూ ముఖ్యమంత్రిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు, పార్టీ నాయకులు బైరి శ్రీను, తిరుమలరావు, దువ్వారపు అప్పన్న, పోలాకి నర్శింహమూర్తి, సురంగి నర్సింగరావు ఉన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

తెలగవలస సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కృష్ణదాస్ ప్రారంభించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, పార్టీ నాయకులు ఆడంగి సూర్యనారాయణ, వేలాల రమేష్, కింతలి చలపతిరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కృష్ణదాస్ తదితరులు

నరసన్నపేట: పారశెల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అంపోలు రాము, మెరుగు వెంకటరమణ, ఒమ్మరివల్లి దేశయ్య, దుబ్బ శాంతారావు తదితరులున్నారు. పారశెల్లి గ్రామంలో పార్టీ మరింత బలపడే విధంగా అందరూ సమైఖ్యంగా పనిచేయాలని, పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానించాలని గ్రామ స్థాయి నాయకులకు ఎమ్మెల్యే సూచించారు.

జోరుగా ఇంటి పన్ను వసూలు



ఆకులతంపరలో పన్ను వసూలు చేస్తున్న పంచాయితీ కార్యదర్శి విక్టోరియన్ రాణి

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటి పన్ను వసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పన్ను వసూలు చేస్తున్నామన్నారు. కోవిడ్–19 కారణంగా ఇంటి పన్ను వసూళ్లలో కొంత జాప్యం జరిగిందన్నారు.

రామనామ స్మరణతో జన్మ ధన్యం



ప్రవచనాలు చెబుతున్న శ్రీనివాసరావు

కొత్తూరు: రామనామ స్మరణతో జన్మ ధన్యమవుతోందని ప్రముఖ ప్రవచనకర్త యాలాల శ్రీనివాసరావు అన్నారు. రథసప్తమిని పురస్కరించుకొని కొత్తూరులోని సీతారామ ఆలయంలో వారం రోజుల ఆధ్యాత్మిక ప్రవచనాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారాములను నేటి ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రామాయణంలో ఓ మహత్యం ఉన్నందున యుగాలు మారిన శ్రీరాముని గొప్పతనం తగ్గలేదన్నారు.

● బోరును కప్పేసిన రాళ్లు!



ప్రజల నీటి అవసరాలను తీర్చాల్సిన బోరు చుట్టూ రాళ్ల కుప్ప దర్శనమిస్తోంది ధర్మలక్ష్మీపురం పంచాయితీ దాసుపురం గ్రామంలో. స్థానికులు కొంత మంది రాళ్ల కుప్పను వేయడంతో బోరింగు కనిపించకుండా పోయింది. గ్రామంలోని ప్రధాన వీధులో ఉన్న ఈ చేతిబోరు కొద్దిరోజులుగా పని చేయడం లేదు. అయితే ప్రస్తుతం రాళ్ల కుప్ప దీన్ని కప్పేయడంతో మరమ్మతులు చేపట్టేందుకు కూడా వీలులేకుండా పోయింది. అధికారులు స్పందించి రాళ్లను తొలగించడంతోపాటు బోరింగును బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

-సారవకోట

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పొందూరు: గూనానపేట గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రుత్వికులు గన్నవరపు రాంబాబు ప్రత్యేక పూజలను చేశారు. మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గూనానపేట, తండ్యాం, మెట్ట, కిలారిపేట తదితర గ్రామ ప్రజలకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

తుడ్డలిలో షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

బూర్జ: తుడ్డలి గ్రామంలోని షిర్డీసాయి బాబా ఆలయ ఆరో వార్షికోత్సవం ధర్మకర్త కాణపాక చౌదరి నాయుడు దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. అర్చకులు పంచామృత అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ద్విచక్ర వాహనాల వేలం

పాతపట్నం: వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను ప్రహరాజపాలెంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో శనివారం వేలం వేసినట్టు సీఐ వై.లక్ష్మునాయుడు తెలిపారు. జీఎస్టీతో కలిపి 37,760 రూపాయలకు వాహనాలను వేలం పాటలో పాల్గొన్న వ్యక్తులు దక్కించుకున్నట్టు చెప్పారు. ఎస్సై దస్తాగిరి, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు శాతశాతం జరగాలి



సిబ్బందితో మాట్లాడుతున్న లతశ్రీ

ఎల్.ఎన్.పేట: రబీలో సాగు చేస్తున్న అన్ని పంటలను ఈక్రాప్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి పైడి లతశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. వరి, మొక్క జొన్న, అపరాలు, కూరగాయల పంటలను ఈక్రాప్‌లో నమోదు చేయించుకునేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు.

జీవితాలను పాడుచేసుకోవద్దు

● జూనియర్ సివిల్ జడ్జి మణి



మాట్లాడుతున్న జడ్జి మణి

ఆమదాలవలస: నేరాలకు అలవాటు పడి ఉజ్వల భవిష్యత్తును, నిండు జీవితాలను బలి చేసుకోవద్దని ఆమదాలవలస సివిల్ జడ్జికోర్టు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.మణి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యాహక్కు చట్టం, చైల్డ్ లైన్ 1098, బాలల హక్కులు, బాల్యవివాహాలు తదితర చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, న్యాయవాదులు హెచ్.అసిరినాయుడు, ఏజీపీ ఎస్.గోవిందరావు, ఎస్.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

● మండల సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణదాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

జలుమూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని సచివాలయాల పరిధిలోని జగనన్న కాలనీలను సకాలంలో పూర్తి చేసి ఉగాది రోజున జరిగే సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఉండే చిన్నపాటి అడ్డంకులను అధిగమించాలన్నారు. అర్హులకు సంక్షేమ ఫలాలు చేరువ కావాలంటే అధికారుల చొరవ ఉండాలన్నారు. ఉద్యోగులు బాధ్యతతో పనిచేస్తే పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా ఉందుతాయని.. తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్నారు. ఎంపీపీ గోపి మాట్లాడుతూ.. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు ముందస్తుగా తీసుకోవాలని నీటిసరఫరా విభాగం ఏఈ చైతన్య కుమార్‌కు ఆదేశించారు. రబీలో సాగు చేస్తున్న పంటలకు ఈక్రాప్ చేయించుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ సూచించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్‌ను శతశాతం పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఏఈ వారాణాసి వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ డోల నాగరత్నం, చల్లవానిపేట, అల్లాడ పీఏసీఎస్ అధ్యక్షులు రాజప్పల నాయుడు, మునలినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, మండల సలహాదారు పైడి విఠలరావు, ఎంపీడీవో జీవి రవికుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం



ఆరోగ్య ఉప కేంద్రంలో పూజలు చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: గిరిజన ప్రాంతమైన ఇల్లాయిపురం సచివాలయం పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆంపురం సర్పంచ్ డి.జమ్మయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లాయిపురం సచివాలయం పరిధిలో ఎక్కువ గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆలోచించారన్నారు. ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవన నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. అయితే ఇది పూర్తయ్యే వరకూ ప్రజలకు వైద్యసేవలకు అంతరాయం కలగకుండా తాత్కాలికంగా అద్దె భవనంలో కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌వో సంతోష్‌కుమార్, ఏఎన్ఎంలు నీలవేణి, సంతోషి, కార్యదర్శి తవిటినాయుడు, వీఆర్వో రత్నం, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్, సచివాలయ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

కొత్తూరు: ఎన్నికలు ఎప్పుడు జరిగినా పాతపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు అన్నారు. కొత్తూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరేలా నిత్యం కృషి చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి నేతృత్వంలో పార్టీ విజయఢంకా మోగిస్తోందన్నారు. కొంతమంది చిల్లర రాజకీయాలు చేయడం తగదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గోగుల వరప్రసాదరావు, పడాల లక్షణరావు, గండివలస ఆనందరావు, బూర్లె శ్రీనివాసరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, మోజ్జాడ చక్రపాణి, వనుము లక్ష్మీనారాయణ, జడ్డు రామకృష్ణ, పంకజ దాస్, సీహెచ్ జోగినాయుడు ఉన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు తగవు

పాతపట్నం: పార్టీలో ఉంటూ.. పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు చేయడం తగదని ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్‌లు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. కొంతమంది పార్టీ, నాయకులపై తప్పుడు ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో నాయకులు ఎనుగుతల సూర్యం, జి.రాము, పనుకు మోహన్, వరదరాజులు, సుందరరావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి



కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు: గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్లి ప్రసాద్ కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి శనివారం నిరసన తెలియజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈవోపీఆర్డీ కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమములో పారిశుధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు వెంకటమ్మ, ప్రతినిధులు రామారావు, దండాసి పాల్గొన్నారు.

వేడుకగా వేణుగోపాలస్వామి చక్రతీర్థ స్నానాలు



చక్రతీర్థ స్నానాలు చేస్తున్న భక్తులు

కొత్తూరు: మెట్టూరులోని లక్ష్మీవేణుగోపాలస్వామి చక్రతీర్థ స్నానాలు స్థానిక ఊర చెరువులో శనివారం వేడుకగా జరిగాయి. ఆలయంలో మూడు రోజులుగా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. చివరి రోజున స్వామివారికి కల్యాణం జరపగా భక్తులు అధికంగా హాజరయ్యారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎం.చక్రపాణి, కమలాఖర్, పాండురంగ పాల్గొన్నారు.

హక్కులపై గిరిజనులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెలుగు కోఆర్డినేటర్లు

మెళియాపుట్టి: నివాస, అటవీ హక్కులపై గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని కొత్తూరు వెలుగు ఏరియా కోఆర్డినేటర్లు నాగరాజు, జగన్ అన్నారు. ఆంపురం, పెంగువాడ, బంజీరుపేట గ్రామాల్లో హక్కులపై గిరిజనులకు శనివారం అవగాహన కల్పించారు. 2006 అటవీహక్కుల చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. నివాస హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంపురం సర్పంచ్ జమ్మయ్య మాట్లాడుతూ.. కొత్తూరు వెలుగు సంఘం సభ్యులు ఎప్పటికప్పుడు గిరిజన గ్రామాలను సందర్శిస్తూ పలువిషయాలను తెలియజేస్తూ సహకారం అందిస్తున్నారన్నారు.